క
థ

# గచ్చుపూత

● రావుల పుల్లాచారి



తలగడ కింద ఉన్న సెల్‌ఫోన్ గణగణమంటూ మోగేసరికి మగత నిద్రలో ఉన్న చలపతి ఒక్కసారిగా ఉలిక్కిపడి టైం చూశాడు రాత్రి రెండు గంటలవుతోంది.

సెల్ ఆన్ చేసి "హలో! నేనురా! రాజారావును.. నా... రాజేశ్వరి ఏమి చెప్పకుండానే నన్ను విడిచి వెళ్లిపోయిందిరా" అంటూనే గొల్లుమన్నాడు.

"అరే ఘోరం జరిగిపోయింది... నేను వస్తున్నాను... నువ్వు ధైర్యంగా ఉండు" అన్నానే కాని గుండె వేగంగా కొట్టుకుంటుంటే, నా మిత్రుడు రాజారావు కళ్లల్లో మెదిలాడు. వాడు నేను చిన్నప్పటి నుండి మంచి స్నేహితులం, కలిసి చదువుకొన్నాము, ఉద్యోగాలు చేస్తున్నపుడే, మా ఇద్దరి పెళ్ళిళ్లు నెల వ్యవధిలో ఒకే సంవత్సరంలో జరిగాయి. వాడికి ఇద్దరు మగ పిల్లలు అయితే నాకు ఇద్దరు ఆడపిల్లలు. అందరూ ఒక ఈడువారే ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసిన, మా రెండు కుటుంబాల వాళ్లం, పండుగలలో, మా పిల్లల పెళ్ళిళ్లలో ఎంతో సన్నిహితంగా కలుసుకుంటూ ఉండే వాళ్లం. అలా పెనవేసుకున్న మా స్నేహం, పదవీ విరమణ అనంతరం కూడా ఒక ఊర్లోనే స్థిరపడ్డాం. రోజూ కలుసుకుని కాసేపు మాట్లాడుకోనిదే మా ఇద్దరికీ నిద్ర పట్టదు. నిన్న సాయంత్రం కలుసుకొన్నపుడు మాత్రం "రాజేశ్వరి ఆరోగ్యం అంత బాగా లేదురా. డాక్టర్ వద్దకు వెళ్లి వచ్చాము" అని మాత్రమే చెప్పాడు. కానీ, ఇంత హఠాత్తుగా ఇలా జరుగుతుందని ఊహించలేకపోయాము. ఆలోచిస్తూనే గబ గబ రాజారావు ఇంట్లోకి వెళ్లాను.

● ● ● ● ● ● ● ●

రాజేశ్వరి తలగడ వద్ద కూర్చుని ఏడుస్తున్న రాజారావును చూసేసరికి పొర్లుకు వస్తున్న దుఃఖాన్ని అదుపు చేసుకుంటూ దగ్గరకు వెళ్లాను. వాడి తలను దగ్గరకు అదుముకొన్నాను. రాజేశ్వరి ప్రాణం లేని రాజేశ్వరిలా కనిపించడం లేదు. నిద్రలోకి జారినట్టుగా ఉంది. మొహంలో చిరునవ్వు చెరగనట్టే ఉంది. ఉదయం ఎప్పుడో ధరించిన ఎర్రని కుంకుమ అరుణ బింబంలా, నుదుటిపైన ఇంకా మెరుస్తోంది.

"అన్నయ్యా! వచ్చారా! కూర్చోండి అంటూ రాజేశ్వరి మాట్లాడినట్టు అనిపిస్తుంటే నగం వరకు కప్పిన తెల్ల గుడ్డని మొహం మీద కప్పాను.

"ఒరే! చలపతి నా రాజేశ్వరి కళ్ల ముందు నేను వెళ్లిపోయి ఉంటే బాగుండేదిరా. నాకు ఏమీ పాలుపోవడం లేదు. కాళ్లు చేతులు ఆడడం లేదురా. పిల్లలకు ఫోన్ చేసి జరిగింది చెప్పు. ఏర్పాట్లు అన్ని చూసుకోరా" అంటూ కుప్పలా కూలిపోయి భోరున విలపించసాగాడు.

పిల్లలు వచ్చే వరకు అన్నీ నేను చూసుకుంటాను, ముందు నువ్వు అలా కూర్చో అంటూ ఓదార్చి, రాజారావు పిల్లల సెల్ నంబర్లు అన్నీ కూడా నా పిల్లల నంబర్లతో పాటు ఫీడ్ చేసుకున్నాను. బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాజారావు పెద్ద కొడుకు ప్రదీప్‌కు రింగ్ చేశాను. సెల్ మోగిన రెండు క్షణాల్లోనే లిఫ్ట్ చేసి "హలో" అన్నాడు.

"నేను ప్రదీప్... చలపతి మావయ్యను"

"ఓ మీరా! మావయ్యా. ఏమిటి ఇంతరాత్రి వేళ చేశారు?"

"అవసరం అలాంటిది బాబు.. మీ అమ్మ... గంట క్రితం చనిపోయింది.. నువ్వు త్వరగా వచ్చేయి.."

"అమ్మ చనిపోయిందా! ఎలా జరిగింది మావయ్యా! ఈ వారంలో నేను అమెరికా వెళ్తున్నానమ్మా అంటే సరే అంది కద మావయ్యా ఇంతలోనే ఎలా వెళ్లి పోయింది? నేను మాట్లాడింది అదే ఆఖరి మాట అవుతుందని అనుకోలేదు. నేను బయలుదేరుతున్నాను అక్కడికి చేరుకునే సరికి మధ్యాహ్నం అవుతుంది. అంతవరకు నాన్నగారిని జాగ్రత్తగా చూస్తుండండి, అంటూ ఏడుస్తూ ఫోన్ కట్ చేశాడు.

నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లో మంచి హోదాలో పని చేస్తున్న రాజారావు చిన్న కొడుకు నవీన్‌కు కూడా ఫోన్ చేసి అలాగే చెప్పాను.

పిల్లలు వచ్చే వరకు అన్నీ నేను చూసుకుంటాను, ముందు నువ్వు అలా కూర్చో అంటూ ఓదార్చి, రాజారావు పిల్లల సెల్ నంబర్లు అన్నీ కూడా నా పిల్లల నంబర్లతో పాటు ఫీడ్ చేసుకు న్నాను. బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాజారావు పెద్ద కొడుకు ప్రదీప్‌కు రింగ్ చేశాను. సెల్ మోగిన రెండు క్షణాల్లోనే లిఫ్ట్ చేసి "హలో అన్నాడు.

షాక్ తిన్నవాడిలా వణికిపోతూ 'అమ్మా అమ్మా' అంటూ రోదిస్తోన్న తీరు నా చెవులకు హృదయ విదారకంగా వినిపిస్తుండగా "నువ్వు త్వరగా వచ్చేయి బాబు" అన్నాను.

"ఇప్పుడే వస్తున్నాను మావయ్య.. అంటూ ఫోన్ కట్ చేశాడు.

నా మిత్రులు, రాజారావు మిత్రులు అందరు ఒక్కరే కాబట్టి, వారందరికీ ఫోన్ చేశాను. రాజేశ్వరి పుట్టింటి వారు కూడా దాదాపు నాకు తెలుసు కాబట్టి, వారిని అడగకుండానే రాజేశ్వరి మరణవార్త అందించాను. అప్పటికి పూర్తిగా తెల్లవారిపోయింది. కాలనీవాసులంతా ఒక్కొక్కరుగా వచ్చి, రాజారావును పరామర్శిస్తున్నారు.

రాజారావు పిల్లలు బయలుదేరి వస్తున్నారా? బంధువులందరికీ సమాచారం అందించారా! అంటూ నన్ను ఉద్దేశించి.. ఏర్పాట్లన్నీ కానివ్వండి అన్నట్టుగా చెబుతూ వెళ్లసాగారు.

సమాచారం అందరికీ అందించాను, వాళ్లు వచ్చేలోగా ఇక్కడి పనులన్నీ పూర్తి చేస్తాను అంటూ, రాజేశ్వరి దగ్గర కూర్చున్న, రాజారావును లేపి మొహం కడిగించి "టీ" తాగిద్దామని వెళ్లాను, "లేరా, రాజేశ్వరి అదృష్టవంతురాలు! నీ చేతుల్లో తనువు చాలించింది. సంతోషంగా సాగనంపుదాం" అంటూ లేపి గట్టిగా పట్టుకున్నారు.

"ఒరే! చలపతి, నా ఏటీయం కార్డ్ ఇస్తాను నీ వద్ద ఉంచుకుని అవసరమున్న డబ్బు తీసి కార్యక్రమాలన్నీ నడిపించు, పిల్లలు వచ్చిన తరువాత ఆలోచిద్దాం"

కార్డు వద్దు ఏమీవద్దు డబ్బు విషయం నేను చూసుకొంటాను. ముందు నువ్వు టీ తాగు అంటూ ఓదార్చాను.

పెద్ద కొడుకు ప్రదీప్, కోడలు, రోజా కారు దిగి గబగబా వచ్చి తల్లి శవం మీద పడి భోరుమని ఏడుస్తున్నారు. "అత్తయ్యకు సీరియస్‌గా ఉందని ఒకరోజు ముందే చేరితే వచ్చేసే వాళ్లం కదా మావయ్యా! రోజా రాజారావు ముందు వాలిపోయి రాగాలు తీయసాగింది.

"సీరియస్‌గా ఉందన్న విషయం వాడికి కూడా తెలియదు కదమ్మా, సడెన్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. నిన్న రాత్రి మీ అత్తమ్మతో మాట్లాడి వెళ్లాను"

చిన్న కోడలు నవీన్, స్వప్నలు కారు దిగి వచ్చి రాజేశ్వరి మీదపడి పోయాడు. అతని ఏడుపు చూస్తుంటే, అక్కడ గుమికూడిన వారందరూ కూడా చలించిపోయారు.

"ఎంతైనా చిన్నకొడుకు కదా! నవీన్‌కు ఉద్యోగం, ఈ అమ్మాయితో పెళ్లి అయ్యేవరకు ఒళ్లో పెట్టుకుని గారాబం చేసింది" అంటూ రాజేశ్వరిని బాగా తెలిసిన వారు నవీన్‌ను ఓదార్చసాగారు.

"ఇంకేం, పిల్లలు వచ్చారుగా, కార్యక్రమాలు మొదలుపెట్టండి" అంటూ నన్ను మరింత పురమాయించసాగారు.

సరే, ఇక నా పనే మిగిలింది అనుకుంటూ మరో ఇద్దరు మిత్రులు కైలాసం, రామనాథంలను తీసుకుని కావలసిన సామాన్లు, పనులు అన్నీ వేగవంతంగా సిద్ధం చేశాం.

ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండి నడిపించడంలో కైలాసం బాగా అనుభవమున్న మనిషి అతనే కలుగజేసుకుంటు..

"ఒరే, చలపతి ఇంకేం ఆలోచిస్తున్నావు "తల్లికి నిప్పు చిన్నకొడుకు చేత పెట్టిద్దాము నవీన్‌ను లేపి స్నానం చేయించు, ప్రదీప్ నువ్వు కూడా వెళ్లి తమ్ముడితో పాటు స్నానం ముగించుకుని తడిగుడ్డలతో రండి" అంటుండగానే, మరోసారి అందరూ గొల్లుమన్నారు. ఇంటిముందు చావు డప్పులు మోగసాగాయి.

అభిమానులు, బంధువుల మధ్య రాజేశ్వరి దహన క్రియలు పూర్తి చేసి, ఇల్లు చేరుకునే సరికి మధ్యాహ్నం దాటిపోయింది.

రాజారావు చాలా కృంగిపోయాడు. దుఃఖాన్ని ఆపుకోవడం వాడి తరం కావడంలేదు. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశాను. రాజారావు ఒక ముద్ద తినేవరకు ఉండి నేను ఇంటికి వెళ్లబోతుంటే...

"మావయ్యా! ప్రదీప్ పిలుపుతో వెనుకకు తిరిగాను. ఇలా వచ్చి కూర్చోండి అంటూ కూర్చోపెట్టుకుని చెప్పడం ప్రారంభించాడు.

"అన్నీ చూసుకునే అమ్మ పోవడం వల్ల మాకు దుఃఖం ఆగడం లేదు. ఈ సమయంలో ఈ కార్యక్రమాలు ఎలా జరపాలో మాకు అసలు తెలియదు. నాన్నగారిని ఇపుడు ఏ సలహా అడగలేం.. అవునన్నట్టుగా ప్రదీప్ వైపు చూశాను.

"ఇవాళ్టి ఖర్చులతో మావయ్య, పదోరోజు ముగిశాక లెక్క చూసుకుందాం"

నా పక్కనే కూర్చున్న నవీన్ వైపు చూశాను, అర్థం చేసుకున్నట్టు ఉన్నాడు.

"సరే మావయ్యా, అన్నయ్య చెప్పినట్టుగానే జరిపించండి" అంటూ కళ్లు ఒత్తుకున్నాడు.

దశదిన కర్మలు శాస్త్రోక్తంగా జరిపించే బాధ్యతలను, నామీద పెట్టడంలో కూడా అర్థం ఉందనుకొన్నాను. వాళ్లు అనుభవం లేనివారు, తల్లిపోయిన దుఃఖంలో మునిగి ఉన్నారు. పెద్ద దిక్కు తండ్రి చెప్పి చేయించే స్థితిలో లేడు.

సరే కానివ్వండి! మీ ఇష్ట ప్రకారమే జరిపిస్తాను.. అని చెప్పి ఇంటికి వచ్చాను. పది రోజులపాటు నిర్విఘ్నంగా జరిపించాల్సిన కర్మలన్నీ జరిపించాను. ఆఖరిరోజు సహపంక్తి భోజనాలకు, కాలనీ



వాసులందరినీ పిలిచాం, హాజరైన వారందరూ ముత్తయిదువగా వెళ్లిందంటూ రాజేశ్వరి ఫోటోకు నమస్కరిస్తూ వెళ్లారు.

ఎవరి అత్తవారింటికి వాళ్లు నిద్రలకు కూడా వెళ్లి వచ్చారు. ఇక ఇంట్లో రాజారావు, కొడుకులు, కోడళ్లు మాత్రమే మిగిలారు.

ప్రతిరోజు చేసిన ఖర్చు అంతా రెండు కాగితాల్లో రాసుకొని రాజారావు ఇంటికి వెళ్లాను. వెళ్లేసరికి సోఫాలో కూర్చున్న రాజారావు, "రా.. రా.. చలపతీ.. ఇలా కూర్చో.." అంటూ పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

"ప్రదీప్, చలపతి మావయ్య వచ్చాడు తమ్ముణ్ణి తీసుకుని ఇలా రండి" అంటూ పిలిచాడు.

కొడుకులు, కోడళ్లు అందరూ వచ్చి నా ముందు కుర్చీల్లో కూర్చున్నారు.

రాజేశ్వరి లేని లోటు ఆ ఇంట్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంటే, కళ్లు చెమ్మగిల్లాయి.

"చూడండి బాబు.. అమ్మకు పెట్టిన ఖర్చు మొత్తం, ఈ రెండు కాగితాల్లో రాశాను ఒకసారి చూడండి.." అందించబోయాను.

"అదేంటి మావయ్యా.. లెక్క చూడడం దేనికి.. అంటూ నసుగుతున్న ప్రదీప్‌ను చూస్తోన్న భార్య రోజా కల్పించుకుని "అదేం లేదు బాబాయి, అందులోకి ఇంకొక పద్దు చేర్చాల్సి ఉంది.." అంది.

ఆశ్చర్యంగా ఏమిటి అన్నట్టు రోజావైపు చూశాను.

"అదే.. మేము.. ఆ రాత్రి బెంగళూరు నుండి కారు ఎంగేజ్ చేసుకుని సరాసరి వచ్చాం. అందుకుగాను ఒక ఐదు వేలు ఖర్చు రాస్తే బాగుంటుంది..."

ఆమె మాటలు నాకు కరెంట్ షాక్ తాకినట్టు అనిపించింది. స్థాణుగా కూర్చుండిపోయాను.

చిన్న కోడలు భర్త నవీన్‌ను, కనుసైగతోనే కాస్త దూరం తీసుకువెళ్లి ఏదో మాట్లాడుతోంది.

"మనం కూడా కారు చార్జీలను చెబితే బాగుంటుందేమో? స్వప్న మనం వచ్చిన కారు మన సొంత కారే కదా!

"ఆ విషయం, మీకూ నాకు తెలుసు. మనం కారు కొనుక్కున్న సంగతి మావయ్యకు తెలియదు కదండీ! చెప్పండి పెళ్లి లెక్కలో మన ఐదు వేలు కూడా రాయించండి"

నవీన్ చెప్పిన ఐదు వేలు కూడా లెక్కల్లో రాసి, మొత్తం ఖర్చు ఎంతో ఇద్దరికి చెప్పాను. అప్పటికి కూడా ఆ కాగితాలు అందుకోవడానికి ఎవరూ చేయి ముందుకు చాపలేకపోయేసరికి.. కాస్త అనుమానంగా అనిపించింది.

"ఏమిటి బాబు... మీ లెక్కల్లో ఇంకా ఏమన్నా మిగిలి ఉన్నాయా" వాళ్ల వైపు చూశాను. ప్రదీప్ ఏదో చెప్పడానికి సిద్ధమవుతున్నట్టు అనిపించింది.

"మావయ్యా.. తల్లిదండ్రులు పోయినపుడు, వాళ్లను పున్నామ నరకం నుండి తప్పించడానికి, కొన్ని పద్ధతులు పాటిస్తాం కదా! తల్లిపోయినపుడు చిన్నకొడుకు చేతనే తలకొరివి పెట్టిస్తుంటారు.. ఆ.. అదృష్టం ముందుగా తమ్ముడికి దక్కింది.. ఖర్చు కూడా వాడు భరిస్తే... అమ్మ ఆత్మకు శాంతి చేకూరుతుందనిపిస్తుంది.

అసహనంగా మధ్యలోనే కల్పించుకుని "ప్రదీప్ అమ్మకు తమ్ముడు తలకొరివి పెట్టినా కూడా కర్మకాండ మీరిద్దరూ జరిపించాలి కదా! అంత మాత్రానికే ఖర్చులు భరించమనడం న్యాయం కాదు.

"బాబాయిగారూ! అలా అని ఆయన ఉద్దేశం కాదు" అంటూ పెద్ద కోడలు రోజా చెప్పడం ప్రారంభించింది. అత్తమ్మ పోవడంతో మావయ్యగారు ఒంటరివారు అయిపోయారు. ఈ వయసులో మావయ్యగారు ఉండవలసింది మాతోనే కదా! ఆయనను చూసుకోవడానికి మేమంతా ఉన్నాముగా.

"మా డబ్బే వారి డబ్బు, అయినపుడు ఇకముందు వారికి డబ్బుతో పనేముంటుంది. అయినా ఆయనకేం తక్కువ? మావయ్య గారు మాత్రం అత్తమ్మకు అయిన ఖర్చు కొడుకులచేత పెట్టనిస్తారా చెప్పండి" స్వప్న లౌకికంగా చెప్పినా ముందే అనుకున్న విషయంగా స్పష్టంగా అనిపించింది.

నా ఆలోచనలన్నీ భూమిలో పాతుకుపోయినట్టు ఆగిపోయాయి. ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదు. గొంతులో తడి ఆరిపోయినట్టు అయింది.

నా పక్కనే కూర్చుని మౌనంగా వింటున్న రాజారావు ఒంట్లో లేని సత్తువంతా తెచ్చుకుని నా చేతిలోకి లెక్క కాగితాన్ని మెల్లగా తీసుకుని మడతలు, మడతలుగా పెట్టి "బాబూ! ప్రదీప్.. నవీన్.... అంతా మీ ఇష్ట ప్రకారమే జరగనివ్వండి. కానీ, కొన్నాళ్లపాటు నేను ఈ ఇంట్లో నుండి కదలలేనురా.. ఇన్ని సంవత్సరాలు అమ్మతో కలిసి బతికాను కదరా.. ఆమె ఆలోచనలు, జ్ఞాపకాలు, నన్ను ఇంకా విడిచిపెట్టలేదురా.. అమ్మా.. నేను.. మీ చదువుల కోసం ఎంత బాధపడ్డాం?! మీకేం తక్కువం చేశాం? ఊళ్లో ఉన్న పొలం కూడా అమ్మేశాను. ఇపుడు నా దగ్గర ఆస్తిపాస్తులంటూ ఏమున్నాయి చెప్పండి.. ఇంతకాలం పెన్షన్ డబ్బులతో ఇద్దరం బతికాం.. మీరు దూరంగా ఉన్నా కూడా మీరు నిలబడ్డ ఈ అరుగు గుమ్మంమీద అనురాగం ఆత్మీయత ప్రేమానురాగాలను అన్నింటినీ కలగలపి గుమ్మంపూత మీద పరిచిన ముగ్గుల్ని, మీ కాళ్లతో తొక్కి చెరిపేయకండిరా.. వాటి మధ్య నన్ను ఈ ఇంట్లో కొంత కాలం ఉండనివ్వండిరా.. దయచేసి నన్ను మాత్రం.. మీ వెంట.. తీసుకువెళ్లకండి.. బాబూ! నాదంటూ, నా దగ్గర ఏముంది? మీ అమ్మ తన పుట్టింటినుండి పెళ్లినాడు తెచ్చుకున్న ముప్ఫయ్ తులా బంగారు నగల్ని అలాగే కాపాడుకొంది. ఆ నగలన్నీ మెడనిండా ఏనాడూ పెట్టుకుని ఎరగదు. మీకు పుట్టబోయే ఆడ పిల్లలకు అలంకరించాలని... చూసి.. ఆనందించాలని తెగ మురిసిపోయేది పిచ్చిది.. ప్రస్తుతం మడతలుగా మలచిన లెక్క కాగితాన్ని ముందు రెండు ముక్కలు.. ఆ తర్వాత నాలుగు.. ఎనిమిది.. పదహారు.. ఆ తర్వాత ఎన్నో ముక్కలుగా చేసి చేతిలో పట్టుకొన్నాడు. చిన్నగా వీస్తున్న గాలికి, అవన్నీ ఎగిరిపోతుంటే పెళ్లాలెదురుగానే రాజారావు మనసు.

అతన్ని ఓదార్చలేని నేను "ఆ బంగారాన్ని **ఏంచే**ద్దామంటావురా" జీరబోతున్న కంఠంతో అడిగాను.

గాలికి కొట్టుకుపోతున్న కాగితపు ముక్కలన్నింటిని జమచేస్తున్నారు వాడి పిల్లలు.

✪

"మా డబ్బే వారి డబ్బు, అయినపుడు ఇకముందు వారికి డబ్బుతో పనేముంటుంది. అయినా ఆయనకేం తక్కువ? మావయ్య గారు మాత్రం అత్తమ్మకు అయిన ఖర్చు కొడుకులచేత పెట్టనిస్తారా చెప్పండి" స్వప్న లౌకికంగా చెప్పినా ముందే అనుకున్న విషయంగా స్పష్టంగా అనిపించింది.
నా ఆలోచనలన్నీ భూమిలో పాతుకు పోయినట్టు ఆగిపోయాయి.